ఇల్లరికం అల్లుడి ఆత్మహత్య







కళాశాలల బంద్ విజయవంతం

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in



బోధన్ మండలంలోని పెంటాకలన్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



## ఆహార కల్తీ నివారణకు తనిఖీలు

**అక్షరటుడే, ఇందూరు :** కల్తీ ఆహార పదార్థాలను నివారించేందుకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్లో గురువారం ఆహార కల్తీ నిరోధక శాఖ పనితీరుపై సమీక్ష జరిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, టిఫిన్ సెంటర్స్, ఆహార పదార్థాల దుకాణాల్లో తనిఖీలు చేయాలని సూచించారు. నిజామాబాద్‌తో పాటు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాలలో తనిఖీలను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే రీతిలో కలుషిత ఆహార పదార్థాలను తయారుచేసే, విక్రయించే వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాలలో విద్యార్థులకు అందించే భోజన పదార్థాలలో కూడా కల్తీని నిరోధించాలన్నారు. కల్తీ ఆహార పదార్థాలను గుర్తించిన సమయంలో వాటిని సీజ్ చేసి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపాలని, వాటి నివేదికల ఆధారంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారిణి సునీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద



**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు జలశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు గురువారం 26 వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 1,09,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో సమానంగా ఉంది. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. కాకతీయ కాలువకు ప్రస్తుతం నీటి విడుదలను నిలిపేశారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్‌కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

**ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి ప్రస్తుతం 20,514 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 12 గేట్లకు గాను 3 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తం నీటితో నిండుకుండలా ఉంది.

## 2 కే రన్ విజయవంతం చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రీయ ఏక్‌తా దివస్, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం 2కే రన్ నిర్వహించనున్నట్టు ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం నుంచి జీవదాన్ పాఠశాల వరకు 2 కే రన్ కొనసాగుతుందన్నారు. అలాగే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో 2కే ఉంటుందని, యువత, ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




## వర్షం తెచ్చిన కష్టం..

అకాల వర్షం అన్నదాతలను ఆగం చేసింది. పంట చేతికొచ్చే తరుణంలో వానలు పడుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఆరబోసిన ధాన్యం తడిసి పోగా.. కొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన పొలం నేల వాలింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

– మరిన్ని చిత్రాలు 2వ పేజీలో..

జిల్లాలో గంజాయి దందా జోరుగా సాగుతోంది. కామారెడ్డి పట్టణంలోని పాన్ షాపులే అడ్డాలు కొందరు విక్రయాలు చేపడుతున్నారు. యువకులు, విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారుతున్నారు. గంజాయి మత్తు కోసం వారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. అంతేగాకుండా కొందరు మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. జల్సాలకు అలవాటు పడి చోరీల బాట పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. – అక్షరటుడే, కామారెడ్డి



# జోరుగా గంజాయి దందా

- అడ్డాగా మారుతున్న పాన్ షాపులు
- దర్జాగా గాంజా సిగరెట్లు విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి పట్టణానికి రాకపోకలు పెరిగాయి. వ్యాపార సామ్రాజ్యంగా కామారెడ్డి మారిపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు, ఎగుమతులు కూడా పెరిగాయి. ఈ క్రమంలో గంజాయి సరఫరా కూడా పెరిగింది. నేరుగా గంజాయి విక్రయిస్తే ఇబ్బందులు వస్తాయని భావిస్తున్న దందా నిర్వాహకులు గంజాయి సిగరెట్లు విక్రయిస్తున్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో గంజాయి సిగరెట్లు పట్టపగలే విచ్చలవిడిగా లభ్యం అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు లిమిటెడ్‌గా సిగరెట్లు విక్రయాలు చేపడుతున్నట్టుగా సమాచారం.


### అనుమానం రాకుండా..

గతంలో గంజాయి ప్యాకెట్లు విక్రయించేవారు. అయితే పోలీసులు తనిఖీలు పెరగడంతో కేటుగాళ్లు రూటు మార్చారు. ముందుగానే సిగరెట్లలో గంజాయి నింపి.. డబ్బాల్లో పెట్టి ఎవరికీ అనుమానం రాకుండా పాన్ డబ్బాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఆయా షాపుల వద్ద ఎవరికి పడితే వారికి గాంజా సిగరెట్ అమ్మకాలు చేపట్టడం లేదు. ప్రతిరోజు తీసుకునే వాళ్లు, నమ్మకంగా ఉన్న వారికి మాత్రమే విక్రయిస్తున్నారు. కొత్త వాళ్లు వెళ్తే అలాంటివి తమ దగ్గర లభించవు అని చెప్తున్నారు. సిగరెట్లను ప్రత్యేకంగా కోడ్‌తో విక్రయిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఆ కోడ్ చెప్తే మామూలు సిగరెట్ కాకుండా గంజాయి సిగరెట్ ఇస్తున్నట్టుగా సమాచారం.

### బానిసలుగా యువత

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా కొందరు యువకులు గంజాయికి బానిసలుగా మారారు. ఈ మత్తుకు అలవాటు పడిన యువత గంజాయి సిగరెట్లు తాగకపోతే పిచ్చిగా వ్యవహరిస్తున్నట్టుగా తెలుస్తోంది. దసరా ఉత్సవాల సందర్భంగా జరిగిన వివాదానికి కూడా గంజాయి బ్యాచ్ కారణమని ప్రచారం సాగుతోంది. కామారెడ్డిలో గంజాయి విక్రయాలు సాగుతున్నా.. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. పాన్ షాపులు, హోటళ్ల వద్ద తనిఖీలు చేస్తే గంజాయి దందా బయట పడుతుందని పలువురు అంటున్నారు.

### చర్యలు తీసుకుంటాం



కామారెడ్డి పట్టణంలో గాంజా సిగరెట్లు విక్రయిస్తున్నట్టుగా మాకు సమాచారం లేదు. గాంజా సిగరెట్స్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టణంలో తక్షణమే తనిఖీలు చేపడతాం. గతంలో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో సుమారు 30 మంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చాం.

– హన్మంత్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్



## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, రాకేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో లక్షల ఎకరాల్లో కోసిన పంటను కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై కుప్పలుగా ఉంచారన్నారు. కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం.. వర్షాల వల్ల ధాన్యం తడిసి రంగుమారిందని వివరించారు. ఎటువంటి నిబంధన పెట్టకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. అలాగే ప్రతి సీజన్‌లో తగినన్ని టార్పాలిన్లు అందించకపోవడంతో ఇలాంటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. పసుపు బోర్డు జాతీయ ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సులను తనిఖీ చేసిన అధికారులు




**అక్షరటుడే, బోధన్:** నిబంధనలను పాటించని ట్రావెల్స్, స్కూల్ బస్సులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. కర్నూలు జిల్లాలో బస్సు దగ్ధమైన ఘటన నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. దీంట్లో భాగంగా బోధన్ పట్టణంలో ఎంవీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. నిబంధనలు పాటించని ఓ స్కూల్ బస్సుపై కేసు నమోదు చేసినట్లు ఎంవీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రావెల్స్, స్కూల్ బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. లేకపోతే తనిఖీల్లో భాగంగా జరిమానాలు విధిస్తామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు టౌన్ సీఐ వెంకట నారాయణ ఉన్నారు.





## వైభవంగా శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం

భీమ్‌గల్ శివారులోని లింబాద్రి గుట్టపై శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎదుర్కోలు కార్యక్రమం ఆలయ పండితులు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, బాజాబాజంత్రీల నడుమ గర్భాలయం నుంచి కల్యాణ మండపానికి పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఎదుర్కోలు సందర్భంగా అర్చకులు, వారి కుటుంబ సభ్యులు నృత్యాలు చేశారు.

## కుంగిన రోడ్డుకు మరమ్మతులు

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన రహదారికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 28 న అక్షరటుడేలో 'నిజాంసాగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా మూల మలుపు' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కుంగిన రోడ్డును గురువారం జేసీబీతో తవ్వి, కంకర సిమెంట్ పోసి మరమ్మతులు చేపట్టారు. దాంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు వెళ్తుండటం, వర్షాలకు రోడ్డు పగుళ్లు పట్టి హనీ బేకరీ ఎదుట టర్నింగ్ పాయింట్ వద్ద రహదారి కుంగి ప్రమాదకరంగా మారింది. రోడ్డును అలాగే ఉంచితే మరింత కుంగిపోయి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని 'అక్షరటుడే' హెచ్చరించడంతో అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.




## కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**అక్షరటుడే, బోధన్ :** ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, రెంజల్ మండల వ్యవసాయ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నవీపేట మండలం అభంగపట్నం, తడ్‌గాం, రెంజల్ మండలం వీరన్నగుట్ట గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సందర్శించారు. వీరన్నగుట్ట కొనుగోలు కేంద్రం నిర్వహణలో లోటుపాట్లు ఉండడాన్ని గమనించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్దేశిత రైస్‌మిల్లులకు కాకుండా వేరే మిల్లుకు తరలించడాన్ని కలెక్టర్ తప్పుపట్టారు.

### ట్యాబ్ ఎంట్రీల్లో నిర్లక్ష్యం..

ట్రక్ షీట్లు సకాలంలో తెప్పించుకుని, వెనువెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయించడంలోనూ జాప్యం చేస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించని రెంజల్ మండల వ్యవసాయ అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో వారికి బిల్లుల చెల్లింపులు జరిగేలా కృషి చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.



మాయిశ్చర్ మీటర్ ద్వారా కలెక్టర్ స్వయంగా తేమశాతం పరిశీలించారు. 17 శాతానికి లోబడి తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం జరిపించి, మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షానికి ధాన్యం తడిసిపోయిన రైతులతో మాట్లాడారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యాన్ని ఎత్తయిన ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ, నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన బిల్లు మొత్తాలతో పాటు, బోనస్‌ను కూడా ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి మండలంలో నీట మునిగిన వరి పంట



వర్షానికి తడిసిన ధాన్యం





బీర్కూర్ మండలంలో మొలకెత్తిన ధాన్యం

# వర్షం తెచ్చిన కష్టం..

ఉమ్మడి జిల్లాలో వర్షా లు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపై ఆరబోసిన ధాన్యం అకాల వర్షా ల కారణంగా పూర్తిగా తడిసిపోయింది. కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో వర్షా నికి కోతకు వచ్చిన పొలాల్లో నీళ్లు నిలిచాయి. వరిపైరు నేలవాలింది. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఆలూరు మండలం కల్లెడి, రాంచంద్రపల్లిలో బుధవారం కురిసిన వర్షా నికి వడ్లన్నీ తడిసిపోయాయి. ఆలూరు గుత్ప రహదారిపై వరద ఉధృతంగా ప్రవహించడంతో రహదారిని మూసివేశారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్, హన్మాజిపేట్, సంగోజిపేట్, బీర్కూరు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం మొలకెత్తింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



కమ్మర్‌పల్లి మండలంలో..



ఆలూర్ చెక్‌డ్యాం పైనుంచి పొంగిపొర్లుతున్న వరద నీరు



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో నేలకొరిగిన పంట



బీర్కూర్‌లో మండలంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



ఆలూర్ మండలంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఆర్మూర్‌లోని హౌసింగ్ బోర్డులో ఇళ్లలోకి వచ్చిన నీళ్లు

## కళాశాలల బంద్ విజయవంతం




**అక్షరటుడే, ఆర్మూర్:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ నియోజకవర్గంలో తలపెట్టిన బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలను బంద్ చేయించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాలల్లో విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదన్నారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని పేర్కొంటున్నాయని..ప్రభుత్వం ఇలా విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. విద్యార్థుల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పుచేసి యాజమాన్యాలకు ఫీజులు కడుతున్న పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## సోయా కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి


**అక్షరటుడే, కోటగిరి:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని ఉమ్మడి మండలాల తహశీల్దార్ గంగాధర్ కోరారు. పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుల పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. పోతంగల్ సొసైటీ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,328 మద్దతు ధర ఇస్తోందని వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సంఘం అడ్మినిస్ట్రేటర్ మహమ్మద్ రియాజుద్దీన్, సొసైటీ సెక్రెటరీ శివాజీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, హంగర్గ గంగాధర్, దిలీప్ కుమార్, హన్మంత్ రావు పటేల్, లక్ష్మణ్, నాగరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు సహకరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు స్థానిక ప్రజలు, దాతల సహకారం అవసరమని మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు శ్మశాన వాటికలో దింపుడు కళ్లెం, పూజ మందిరం, స్టోర్ రూమ్, రెండు బర్నింగ్ పాయింట్ల నిర్మాణాలను ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన దంతవైద్యుడు అచ్చుకట్ల జీవన్, తన తండ్రి అచ్చుకట్ల మారుతి జ్ఞాపకార్థం శ్మశానంలోని దింపుడు కళ్లెం, పూజ మందిరాల పెయింటింగ్ కోసం 100 లీటర్ల రంగును విరాళం అందజేశారు. గురువారం ఆయన పెయింటింగ్ పనులను ప్రారంభించారు.

## ఎస్ఏ–1 పరీక్షల తనిఖీ



**అక్షరటుడే బాల్కొండ:** మండల పరిధిలో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను డీసీబీ సెక్రెటరీ బీ.సీతయ్య, ఎంఈవో రాజేశ్వర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాల్కొండ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పరీక్షా నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్న తీరు, పర్యవేక్షణ విధానం, పరీక్షా సెంటర్ల ఏర్పాటును వారు సమీక్షించారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

## కొనుగోలు కేంద్రాల తనిఖీ



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని బాల్కొండ, చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. అలాగే ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎంపీవో గంగామోహన్, సూపరింటెండెంట్ దాసరి రమణ, హౌసింగ్ ఏఈ నితీష్, పంచాయతీ కార్యదర్శులు రజినీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

**అక్షరటుడే,కోటగిరి:** హైదరాబాద్‌లో నవంబర్ 1న జరుగనున్న దళితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచీరం కోరారు. పోతంగల్ మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ.. నవంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఉమ్మడి మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు దళితులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేరోళ్ల సాయిలు, మారాజ్ భూమయ్య, సోనాయి పోచయ్య, శీను, నక్కేవర్, సంజు, గంగాధర్, ఎల్లప్ప, బాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఛలో హైదరాబాద్‌కు తరలిరావాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 1న చేపట్టనున్న ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కంతి పద్మారావు మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీజేఏపై



దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో బషీర్‌బాగ్ నుంచి బాబాసాహెబ్ అంబేద్కర్ సెక్రెటేరియట్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీకి ప్రతి మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు, మాదిగలు హాజరు కావాలని కోరారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు రామగుండం శివానందం, ఉపాధ్యక్షుడు మానేయ, సామేలు, పరువయ్య, ఆగమయ్య, కాశయ్య, సంగయ్య, సాయి పాల్గొన్నారు.

## ఇల్లరికం అల్లుడి ఆత్మహత్య

**అక్షరటుడే, గాంధారి :** ఇల్లరికం వచ్చిన అల్లుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గాంధారిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలం ఎల్లారం గ్రామానికి చెందిన కాట్రోత్ రవి (36) సోమారం గ్రామానికి కొన్నేళ్ల క్రితం ఇల్లరికం వచ్చాడు. అయితే అక్టోబర్ 23వ తేదీన రవి అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆయన భార్య అతడికి రూ. 3వేలు ఇచ్చి ఆస్పత్రిలో చూపించుకోవాలని పేర్కొంది. అయితే రవి ఆస్పత్రికి వెళ్లకపోవడంతో ఎందుకు వెళ్లలేదని భార్య గొడవపడింది. దీంతో మనస్తాపానికి గురైన రవి ఈనెల 28వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే గమనించిన కుటుంబీకులు అతడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ రవి గురువారం ఉదయం మరణించినట్లు పోలీసులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అయితే మృతుడు రవికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో ఒక్కసారిగా ఇటు సోమరంలో, అటు రవి పుట్టిన ఊరు అయిన లింగంపేట్ మండలం ఎల్లారం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## మహిళ బలవన్మరణం

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి లక్ష్మీ నగర్ తండాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన లంబాడి శోభ (57)కు తన కోడలితో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దాంతో అత్తాకోడళ్లు ఎడమోహం పెడమోహంగా ఉంటున్నారు. గురువారం ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. దాంతో మనస్తాపానికి గురైన అత్త శోభ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పాల్వంచలో యువకుడు..

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉగ్రవాయిలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలానికి చెందిన అన్వేష్ రెడ్డి ఐదేళ్ల క్రితం మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు ఇల్లరికం వచ్చాడు. అయితే గురువారం ఉదయం ఉగ్రవాయి కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఉన్న షెడ్డులో అన్వేష్ రెడ్డి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అన్వేష్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్న స్థలంలో సూసైడ్ నోట్ లభించినట్లు సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ శివారులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన సుధాకర్ (48) గురువారం ఉదయం ఆర్మూర్ పట్టణానికి తన ఎక్సెల్ వాహనంపై బయలు దేరాడు. జాతీయ రహదారిపై పెర్కిట్ శివారులోని మీనాక్షి ఫంక్షన్ హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఆయన ఎక్సెల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## వెల్గటూర్ శివారులో వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని వెల్గటూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మెండోరా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ శివారులోని బట్టాపూర్ వంతెన కింద పెద్దవాగులో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీయించారు. అతడికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు తెలియలేదు. ఆ వ్యక్తికి 65ఏళ్లు ఉంటాయని ఒంటిపై తెల్లటి దుస్తులు ఉన్నాయన్నారు. సమాచారం కోసం మెండోరా ఎస్సై 8712659864, ఆర్మూర్ రూరల్ సీఐ 8712659859ను సంప్రదించాలని సూచించారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**అక్షరటుడే, బాల్కొండ:** ముప్కాల్ మండలకేంద్రంలో గురువారం బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో బి రమేష్, ఎస్సై రజనీకాంత్, తహసీల్దార్ ముంతాజుఉద్దీన్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం 18 ఏళ్లు నిండని ఆడపిల్లలకు, 21 ఏళ్లు నిండని పురుషులకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయసులో పిల్లలకు వివాహం చేయడంతో మాతా-శిశు మరణాలు, పోషకాహార లోపం, పిల్లల ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. వివాహ వయసు వచ్చిన తర్వాతే పిల్లలకు వివాహం చేయాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు.